
## నూతన వధువరులకు శ్రీనివాస్ రెడ్డి ఆశీర్వాదం



**రాయపర్తి/మే 6(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని మొరిపిరాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాయితోజు సోమయ్య చారీ కూతురు ప్రవళిక – రాజు ల వివాహం తొర్రూర్ రామ ఉపేందర్ గార్డెన్స్ లో జరుగగా వివాహ వేడుకలో బుధవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్,లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, సంకినేని ఎల్లస్వామి,పెందోట శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వరి గడ్డి మిషన్ ప్రమాదంలో రైతు మృతి






**భీమదేవరపల్లి/మే6 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామ శివారులో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ భూమి వద్ద ట్రాక్టర్‌తో వరి గడ్డి కట్టలు కడుతున్న సమయంలో రచ్చ సంపత్ (50) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. వరి గడ్డి కట్టలు కట్టే మిషన్‌ను సరిచేస్తున్న క్రమంలో అతని చెయ్యి మిషన్‌లో ఇరుక్కొని పూర్తిగా భుజం వరకు తెగిపోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో అక్కడికక్కడే అతను మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడి భార్య రచ్చ రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు వెల్లడించారు.

## మక్కల కొనుగోళ్లు వేగవంతం చేయాలి: జేసీ రవి



**ఎల్కతుర్తి/ మే 6(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మక్కల కొనుగోలు ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఎన్. రవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా ఇప్పటి వరకు 5,444 క్వింటాళ్ల మక్కల సేకరణ పూర్తయిందని, లోడింగ్‌లో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న సుమారు 3 లారీల నిల్వలను వెంటనే తరలించాలని సీఈఓ తిరుపతికి సూచించారు. ప్రభుత్వం ప్రస్తుతం ఎకరాకు 25 క్వింటాళ్ల మక్కలను మాత్రమే సేకరిస్తోందని, అయితే దిగుబడి 35 క్వింటాళ్ల వరకు వస్తోందని రైతులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందిస్తూ.. వచ్చే నెలలో పరిమితిని పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉందని ఆయన వివరించారు. మక్కలతో పాటు వరి ధాన్యం కొనుగోళ్లను కూడా వేగవంతం చేసి, రైతులకు ఇబ్బంది కలగకుండా కాంటాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుఖినే సంతాజీ, సొసైటీ ఛైర్మన్ రవీందర్ గౌడ్, తహసీల్దార్ ప్రసాద్ రావు, ఎంపీడీవో విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పదిలో రాణించిన స్ఫూర్తికి సినీ ప్రముఖుల ప్రశంసలు



**తల్లాడ/మే 6(జర్నలిస్ట్ వార్త):** పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన గుమ్మా స్ఫూర్తిని పలువురు సినీ రంగ ప్రముఖులు ఘనంగా అభినందించారు. పది పబ్లిక్ పరీక్షల్లో స్ఫూర్తి 582 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఆమెను ప్రత్యేకంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ వేదికపై ఈ అభినందన కార్యక్రమం జరిగింది. ప్రముఖ సినీ దర్శకులు బోయపాటి శ్రీను, తమ్మారెడ్డి భరద్వాజ, రేలంగి నరసింహారావు, గుణశేఖర్, రాజా వన్నెంరెడ్డితో పాటు సీనియర్ హీరోలు సుమన్, మాగంటి మురళీమోహన్, ప్రముఖ కథానాయిక లయ, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ తదితరులు స్ఫూర్తికి శాలువాలు కప్పి ఆశీస్సులు అందజేశారు.గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి చదువులో రాణించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. సినీ దిగ్గజాల చేతుల మీదుగా ప్రశంసలు అందుకోవడం పట్ల స్ఫూర్తి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మహేశ్వరీ కుటుంబానికి అండగా ఉంటా



**రాయపర్తి/మే 6(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని అసువుల కుంట తండా కు చెందిన గుగులోత్ మహేశ్వరీ ఇటీవల అనుమానస్పదంగా మరణించింది.బుధవారం మహేశ్వరి కుటుంబ సభ్యులు హన్మకొండలో రాష్ట్ర మాజీ ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిసి న్యాయం చేయాలనీ కోరారు.తక్షణమే స్పందించిన కేటీఆర్ పోలీస్ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తా అని హామీ ఇచ్చారు. మహేశ్వరి కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు.కలసిన వారిలో ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్,రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి



**రాయపర్తి/మే 6(జర్నలిస్ట్ వార్త):**ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. బుధవారం పిఏసిఎస్, పేరికేడు గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో కాంటాలు నిర్వహించాలని అన్నారు.ప్రతిరోజూ కనీసం రెండు లారీల చొప్పున ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లారీల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

రాబోయే రెండు మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పల్లిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదని అన్నారు.మిల్లర్లు ధాన్యం తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే, ఆ ధాన్యాన్ని ఇతర మిల్లులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీసిఎస్ఓ కిష్టయ్య,జిల్లా పౌరసంబంధాలా అధికారి సంధ్యారాణి,పౌరసరఫరాల డిటి మధుసూదన్, తహసీల్దార్ శ్రీనివాస్,ఆర్ఐ చంద్రమోహన్, సర్పంచ్ సహింద్ర బిక్షపతి, ఉపసర్పంచ్ మచ్చ రమేష్, సీసీ యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యం : ఇంచార్జ్ సర్పంచ్ హరికుమార్





**భీమదేవరపల్లి/మే6 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామానికి ఇంచార్జ్ సర్పంచ్‌గా మాట్ల హరికుమార్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం ప్రకారం ఆయన ఈ ఏడాది ఆగస్టు నెల 10 వరకు గ్రామ ఇంచార్జ్ సర్పంచ్‌గా కొనసాగనున్నారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో మాట్ల హరికుమార్ బాధ్యతలు స్వీకరించారు. పదవి చేపట్టిన వెంటనే గ్రామంలో తాగునీటి సమస్యను గుర్తించి పాడై ఉన్న బోర్లను మరమ్మతు చేయించారు అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు వంటి మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువత అందరూ కలిసి సహకరించాలని కోరారు. సమిష్టి కృషితోనే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారుపాక శరత్, వార్డు సభ్యులు పార్నందుల నవిత, దండెపల్లి శిరీష, మ్యాక నరేష్, కొర్ర తిరుపతి, కదారి చింటూ, దొండ మౌనిక, రేణికుంట్ల సందీప్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ఒంటరితనం శాపం కాదు.. పోరాడి గెలవాల్సిన యుద్ధం.



ప్రకృతి సృజించిన జీవరాశుల్లో మానవ జన్మ అత్యున్నతమైంది. అటువంటి ఉజ్వలమైన జీవితాన్ని, కంటికి కనిపించని ఒంటరితనం అనే కీటకం లోలోపల తొలుచుకుపోతుంటే చూస్తూ ఊరుకోలేం. ఆధునిక కాలంలో మనిషి సౌకర్యాల మధ్య విహరిస్తున్నాడు కానీ, మనసు నిండా భావాలను పంచుకునే తోడు కోసం తపిస్తున్నాడు. చుట్టూ కోట్లాది మంది జనం.అరచేతిలో ప్రపంచాన్ని చూపే అంతర్జాలం.. అయినా ఏదో తెలియని వెలితి. ఈ వెలితిని మరణంతో పూడ్చాలనుకోవడం అజ్ఞానమే అవుతుంది.

### సాంకేతికత తెచ్చిన సామాజిక దూరం

సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చిన మాట నిజమే కానీ, మనుషుల మధ్య గోడలను పెంచింది. వందలాది డిజిటల్' మిత్రులు ఉన్నా, మనసు భారమైనప్పుడు భుజం తట్టి నేనున్నానంటూ భరోసా ఇచ్చే మనిషి కరువయ్యారు. సామాజిక మాధ్యమాల్లో మనం చూసే అందమైన ఫోటోల వెనుక ఎందరో వ్యక్తులు మౌనంగా కన్నీరు తుడుచుకుంటున్నారు. నన్ను ఎవరూ అర్థం చేసుకోవడం లేదు అనే భావన మనిషిని ఆత్మహత్య అనే అగాధంలోకి నెడుతోంది. అయితే, ఒక్కటి గుర్తుంచుకోవాలి.. చీకటి తర్వాతే వెలుగు వస్తుంది, అలాగే ఏకాంతం తర్వాతే కొత్త పరిచయాలు మొదలవుతాయి.

### ఆత్మబలమే అసలైన ఆయుధం

మరణం అనేది సమస్యకు ముగింపు కాదు, అది కేవలం పారిపోవడం మాత్రమే. కష్టాలు, కన్నీళ్లు నిత్యం వస్తూనే ఉంటాయి. కానీ, గాలివాన వచ్చినా చెట్టు నిలబడినట్లే, కష్టాలు వచ్చినా మనిషి ఆత్మస్థైర్యంతో నిలబడాలి. ఓటమిని అంగీకరించి తలవంచే కంటే, పోరాడి గెలవడంలోనే మనిషి గొప్పతనం ఉంది. మనలోని అంతర్గత శక్తిని మేల్కొలిపితే, ఒంటరితనం కూడా ఒక అద్భుతమైన అవకాశంగా మారుతుంది.

### వెలుగు దిశగా అడుగులు..

ఒంటరితనం నుంచి విముక్తి పొందడానికి మనమే చొరవ తీసుకోవాలి, సంభాషణే సంజీవని: మౌనంగా కుమిలిపోవద్దు. ఆత్మీయులతోనో, స్నేహితులతోనో మీ మనసులోని బాధను పంచుకోండి. మాట అనేది మనసు భారానికి మందులా పనిచేస్తుంది.ఖాళీ సమయాన్ని ఆలోచనల పరంపరలో వృథా చేయకండి. పుస్తక పఠనం, సంగీతం, సామాజిక సేవ వంటి పనుల్లో నిమగ్నమవ్వండి. తీవ్రమైన మానసిక వేదన ఉన్నప్పుడు నిపుణులైన కౌన్సిలర్లను కలవండి. మానసిక దృఢత్వం కోసం సహాయం పొందడం ధైర్యానికి నిదర్శనం. జీవితం ఒక నిరంతర ప్రయాణం. ఇందులో ఎన్నో మలుపులు, ఎన్నో మజిలీలు ఉంటాయి. ఒంటరితనం అనేది ఈ ప్రయాణంలో ఎదురయ్యే ఒక చిన్న మలుపు మాత్రమే. అంతటితో దారి ముగిసిపోదు. రేపటి సూర్యోదయం మీ కోసం కొత్త ఆశలను, కొత్త మనుషులను పరిచయం చేస్తుంది. ఆశావహ దృక్పథంతో ముందడుగు వేయండి. మిమ్మల్ని ప్రేమించే కళ్లకు మీ ప్రాణం ఎంతో విలువైనది. ప్రాణాన్ని త్యాగం చేయడం కాదు.సమస్యను ఎదిరించి ప్రాణపదంగా జీవించి చూపడమే అసలైన విజయం. చావడం కాదు.గెలిచి చూపడమే జీవితం



సీనియర్ జర్నలిస్ట్
బిర్రు కరుణాకర్

# వర్ధన్నపేట పీఏసీఎస్ ఛైర్మన్‌గా రాజేష్ ఖన్నా బాధ్యతల స్వీకారం





**వర్ధన్నపేట/మే6(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా కౌడగాని రాజేష్ ఖన్నా బుధవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. గతంలో రద్దయిన పాలకవర్గాలను పునరుద్ధరించాలంటూ హైకోర్టు వెలువరించిన తీర్పును గౌరవిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఆయన మళ్ళీ పదవీ బాధ్యతలు స్వీకరించారు.
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంఘం సీఈఓ వెంకటయ్య సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. రాజేష్ ఖన్నాతో పాటు వైస్ ఛైర్మన్ కుల్లా సోమయ్య, డైరెక్టర్లు మహేందర్, బలరాం రావు, లక్ష్మీ, నర్సయ్య, రమేష్, మోతాజి తదితరులు తమ విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఛైర్మన్ రాజేష్ ఖన్నా విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తమపై నమ్మకం ఉంచి, పునరుద్ధరణకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రైతులకు అందాల్సిన రుణాలు, ఎరువులు, ఇతర సేవలను పీఏసీఎస్ ద్వారా సక్రమంగా అందిస్తాం. అన్నదాతల సంక్షేమమే మా ప్రాధాన్యత. అని వివరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది, పలువురు నేతలు పాల్గొని నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు.

# బొడ్డు రంగమ్మ దశదిన కర్మకు ప్రముఖుల నివాళులు





**జఫర్‌గఢ్/మే 6(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని ఇటీవల మరణించిన బొడ్డు రంగమ్మ దశదిన కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరై రంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ పాల్గొని మాట్లాడారు. రంగమ్మ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ పెద్దను కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటని, వారు ధైర్యంగా ఉండాలని కోరారుజర్నలిస్ట్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్ హాజరై కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి వెంట వర్ధన్నపేట మండల అధికార ప్రతినిధి జిల్లా నాయకులు బిర్రు బిక్షపతి నల్లబెల్లి గ్రామ వార్డు మెంబర్ గోలి సుధాకర్ మాదిగ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లబెల్లి గ్రామ పంచాయతీ వార్డ్ నెంబర్ మరుపట్ల ప్రశాంత్ , మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేశం మాదిగ, ఎలికట్ట కరుణాకర్, కుంటాల గణేష్.కుటుంబ సభ్యులు బొడ్డు లక్ష్మణ్, బొడ్డు నాగరాజు, బొడ్డు నరేందర్, కుమార్తె బిర్రు రజిత తదితరులు. ఉన్నారు.

# కాకతీయ నాటి ఆలయ విధ్వంసంపై పెద్ది సుదర్శన్ రెడ్డి ధ్వజం





**నర్సంపేట/మే 6(జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట నియోజకవర్గంలోని అశోక్ నగర్ గ్రామంలో కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయాన్ని కూల్చివేయడంపై మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విధ్వంసమైన ఆలయ ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, ఈ ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 1213వ సంవత్సరంలో నిర్మించిన ఈ చారిత్రక సంపదను కాంట్రాక్టర్ల లాభాల కోసం, కమిషన్ల కోసం అర్ధరాత్రి దొంగల్లా కూల్చివేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. అభివృద్ధి పేరుతో చరిత్రను చెరిపివేయాలని చూడటం అవివేకమని, కాకతీయుల ఆనవాళ్లను తొలగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. మెడికల్ కళాశాల నిర్మాణ సమయంలో తాను దాతల సహకారంతో స్థల సేకరణ చేశానని, మనసుంటే మార్గాలు ఉంటాయని హితవు పలికారు. ఆర్కియాలజీ విభాగం తక్షణమే స్పందించి ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని, బాధ్యులను జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోశాలకు వరిగడ్డి విస్తరణ

**తల్లాడ మే 6(జర్నలిస్ట్ వార్త)**
సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వివాహ వార్షికోత్సవం సందర్భంగా, అంజనాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు కేతినేని చలపతిరావు ఖమ్మంలో గోశాలకు వరి గడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలుచేస్తాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కిన్నెరా వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ కృష్ణయ్య, రాంబాబు, వెంకటరామారావు, వెంకన్న, కృషయ్య, రామారావు తదితరులు పాల్గొని తమ సహకారం అందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
గోశాల నిర్వాహకులు కేతినేని చలపతిరావు కి కృతజ్ఞతలు తెలుపుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.

# పంట అవశేషాలు కాల్చితే కఠిన చర్యలు

## -తల్లాడ తహసీల్దార్



**తల్లాడ/మే 6(జర్నలిస్ట్ వార్త)**పొలాల్లో పంట కోతల అనంతరం మిగిలిన వ్యర్థాలను తగులబెట్టడం వల్ల పర్యావరణానికి, భూసారానికి తీరని నష్టం వాటిల్లుతుందని తల్లాడ తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొక్కజొన్న కోతల తర్వాత రైతులు అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలా చేయడం వల్ల మంటలు అదుపుతప్పి పక్కనున్న పంటలు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.వ్యర్థాల దహనం వల్ల కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, తద్వారా ప్రజలకు, పశువులకు శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయని వివరించారు. అంతేకాకుండా, నేలలోని నత్రజని, ఫాస్ఫరస్ వంటి పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని, దీనివల్ల రైతులు రసాయన ఎరువులపై ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు.అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నాయని,వ్యర్థాలను వర్మీ కంపోస్ట్‌గా మార్చడం లేదా పశుగ్రాసంగా వినియోగించడం మేలని సూచించారు. మల్చింగ్ పద్ధతులు అనుసరించి పర్యావరణాన్ని కాపాడాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

# సంతోష్ కుమార్ దశదిన కర్మకు హాజరైన

## దళితరత్న అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్





**వర్ధన్నపేట/మే 6(జర్నలిస్ట్ వార్త);**
వర్ధన్నపేట మండలం కట్రియాల గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన తుమ్మల సంతోష్ కుమార్ దశదిన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్రియాల గ్రామంలోని ఆయన నివాసానికి దళిత రత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ, హాజరై నివాళులు అర్పించారు. అతి చిన్న వయసులోనే సంతోష్ మరణించడం పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి గ్రామ పంచాయతీ వార్డ్ నెంబర్ గోలి సుధాకర్ మాదిగ, జర్నలిస్ట్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లబెల్లి గ్రామ వార్డ్ నెంబర్ మరుపట్ల ప్రశాంత్, బిర్రు రాజకుమార్, గణపాక హరీష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు.గ్రామస్తులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంట అవశేషాలను కాల్చవద్దు

## ఏఓ రాజ్ కుమార్



**ఎల్కతుర్తి/మే 6(జర్నలిస్ట్ వార్త):** పొలాల్లో పంట కోతల అనంతరం మిగిలిన అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణంతో పాటు భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి మండా రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించిన ఆయన, ముఖ్యంగా మొక్కజొన్న కోతల తర్వాత వ్యర్థాలను తగులబెట్టే ఘటనలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ వంటి ప్రమాదకర వాయువులు విడుదలై గాలి కాలుష్యానికి కారణమవుతాయని, దీనివల్ల ప్రజలకు శ్వాసకోశ సమస్యలు వచ్చే ముప్పు ఉందని హెచ్చరించారు. అంతేకాకుండా, మంటల వేడికి నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం దెబ్బతింటుందని వివరించారు.

**ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించండి**

రైతులు తమ ఆర్థిక స్థితిని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ క్రింది పద్ధతులు పాటించాలని సూచించారు: రోటవేటర్ ద్వారా అవశేషాలను నేలలోనే కలియదున్నడం వల్ల భూమికి సేంద్రియ ఎరువు లభిస్తుంది. వ్యర్థాలను వర్మీ కంపోస్ట్‌గా మార్చుకోవాలి.మల్చింగ్: తేమ ఆవిరి కాకుండా మల్చింగ్ పద్ధతిలో వినియోగించుకోవాలి.
అవశేషాలను కాల్చకుండా పర్యావరణ పరిరక్షణకు రైతులు సహకరించాలని ఏఓ రాజ్ కుమార్, ఏఈఓలు చందు, తిరుపతి విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రసాయన ఎరువులపై ఖర్చు పెరిగి సాగు భారమవుతుందని వారు హెచ్చరించారు.

# రైతుల కన్నీళ్లలో రేవంత్ కొట్టుకు పోవడం ఖాయం

## వరంగల్ రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్



**వరంగల్,మే 6(జర్నలిస్ట్ వార్త):** కేసీఆర్ పాలన రైతాంగానికి స్వర్ణయుగమని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. రైతుబిడ్డగా వ్యవసాయాన్ని పండుగ చేసే విధంగా కేసీఆర్ పాలన కొనసాగిందని అన్నారు. రేవంత్ రెడ్డిది ప్రజాపాలన కాదు రాబందు పాలన అని విమర్శించారు. రైతు కన్నీళ్లలో రేవంత్ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. హనుమకొండలో బీఆర్ఎస్ చేపట్టిన రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు బాగుండాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం ఆగమైందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రెండున్నరేళ్లలో వెయ్యి మంది రైతులు చనిపోయారని తెలిపారు. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యలే అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన గడ్డ వరంగల్ అని తెలిపారు. బీఆర్ఎస్ సభ పెడతామంటే కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతుందని అన్నారు. కేసీఆర్ జగిత్యాలలో మీటింగ్ పెడితే అదే సమయానికి రేవంత్ రెడ్డి మీటింగ్ పెట్టారని తెలిపారు. కానీ రేవంత్ సభ అట్టర్ ఎ÷–లాప్ అయ్యిందని విమర్శించారు. ఒక్క ఎకరానికి రైతు భరోసా వేసి అలయ్ బలయ్ చేసుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులను పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రైతులకు కేసీఆర్ రూ.72వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. వరంగల్ జిల్లాలో చివరి భూముల వరకు కేసీఆర్ నీళ్లిచ్చారని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాను కేసీఆర్ సస్యశ్యామలం చేశారని అన్నారు.

